సాక్షి రంగారెడ్డి
బుధవారం, 7, జూన్, 2023



సాగర్‌రోడ్డుపై ప్రమాదాలు

నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై మంగళవారం మూడు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 8లో▸



దాహార్తి తీరట్లే!

మహా నగర దాహార్తి పూర్తి స్థాయిలో తీరడం లేదు. వేసవి ఉష్ణోగ్రతల తీవ్రత దృష్ట్యా తాగు నీటి వినియోగం బాగా పెరిగింది. 8లో▸



పారిశ్రామిక ప్రగతి ఉత్సవం

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో మంగళవారం పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలు నిర్వహించారు. 8లో▸

న్యూస్‌రీల్

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఏసీపీ రమణ గౌడ్

శంకర్‌పల్లి: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన మోకిల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం స్టేషన్ పరిధిలోని ఎంపీటీసీ, సర్పంచ్‌లు, యువజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రధాన చౌరస్తాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని, నేరస్తులు ఎంతటివారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రవీందర్‌గౌడ్, పాడువు శ్రీనివాస్, మోకిల సీఐ నరేష్, ఎస్‌ఐలు కృష్ణయ్య, కృష్ణ, నాయకులు మోహన్‌రెడ్డి, గౌండ్ర సత్యం, మైసయ్య, సత్యనారాయణరెడ్డి, తొండ రవి, బయన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రీబిడ్ సమావేశం సక్సెస్

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ స్థలాలపై మంగళవారం బేగంపేటలో నిర్వహించిన ప్రీబిడ్ సమావేశానికి అనూహ్య స్పందన లభించింది. రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో మొత్తం 34 ల్యాండ్ పార్సెళ్లు (స్ట్రే బిట్స్) ఉండగా, మంగళవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో ఉన్న 16 స్థలాలపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌ఎండీఏ ఎస్టేట్ ఆఫీసర్ బి.కిషన్ రావు ఈ సందర్భంగా బిల్డర్లు, డెవలపర్ల సందేహాలను నివృత్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎమ్మెస్టీసీ ప్రతినిధి అనురాగ్ ఈ సందర్భంగా ఆన్‌లైన్ వేలం పద్ధతులను, నియమ నిబంధనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రంగారెడ్డి జిల్లాతో పాటు సంగారెడ్డి జిల్లాలోని మూడు మండలాల పరిధిలోని 10 ల్యాండ్ పార్సెల్స్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని నాలుగు మండలాల పరిధిలోని 8 ల్యాండ్ పార్సెళ్లను హెచ్‌ఎండీఏ ఈ నెల 22న ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించనుంది.

'లక్ష్మీదేవిపల్లి'ని వెంటనే నిర్మించాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివ



రిలేనిరాహార దీక్షలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివ డిమాండ్ చేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు మంగళవారం 5వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపడతామని మాట ఇచ్చిన సీఎం కేసీఆర్ ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. లక్ష్మీదేవిపల్లిలో కుర్చీ వేసుకొని రిజర్వాయర్‌ను పూర్తి చేస్తానని ప్రగల్భాలు పలికి ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. నూతనంగా నిర్మించిన సచివాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్షా సమావేశంలో లక్ష్మీదేవిపల్లి నిర్మాణంపై మాట్లాడకుండా ఈ ప్రాంతానికి కాలువలద్వారా నీటిని తరలిస్తామని చెప్పడం చూస్తుంటే రిజర్వాయర్‌ను విస్మరించినట్లు అర్థమవుతోందని అన్నా రు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో చివరిదైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టి ఈ ప్రాంత రైతులు, ప్రజలకు తాగు నీరు, సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించే వరకు ఉద్యమాన్ని విశ్రమించేది లేదని, ఈ ఉద్యమానికి విద్యార్థిసంఘం పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు సాయి తేజ, నాయకులు రఘువరన్, మల్లికార్జున్, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

12న దివ్యాంగులకు ఆర్టీసీ బస్సు పాస్ మేళా

సాక్షి, సిటీబ్యూరో: దివ్యాంగులకు ఈ నెల 12న బస్సు పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగంపల్లి బస్సు పాస్ సెంటర్‌లో మేళా ఏర్పాటు చేయనున్నారు. పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, సదరం సర్టిఫికెట్, ఆధార్, ఐడీ కార్డు సర్వీస్ కోసం రూ.50తో మేళాలో పాల్గొనవచ్చని ఈడీ పేర్కొన్నారు.

బడి బస్సు భద్రమేనా?

- రోడ్డెక్కాలంటే అనుమతి తప్పనిసరి
- ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాల్సిందే..
- నిబంధనలు మీరితే చట్టరీత్యా చర్యలు
- ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న పాఠశాలలు



షాద్‌నగర్: మరి కొద్ది రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను బస్సుల్లో ఇంటి నుంచి తీసుకెళ్లి తిరిగి సాయంత్రం చేరుస్తుంటారు. ఈ పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పాఠశాల యాజమాన్యాలు పర్యవేక్షించాలి. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకొని ధ్రువపత్రాలు పొందాల్సి ఉంటుంది.

ఫిట్‌నెస్ తప్పనిసరి

గడువులోపు ప్రవేటు పాఠశాలల బస్సులకు పాఠశాల యాజమాన్యాలు విధిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. షాద్‌నగర్ పట్టణంలో ఉన్న రవాణా శాఖ కార్యాలయం పరిధిలోకి కొత్తూరు, కొందుర్గు, నందిగామ, కేశంపేట, చౌదరిగూడ, ఫరూఖ్‌నగర్‌తో పాటు ఆమనగల్లు, తలకొండపల్లి మండలాలు వస్తాయి. ఇప్పటి వరకు ఆయా ప్రాంతాలకు చెందిన 30కి పైగా బస్సులు ఫిట్‌నెస్ పరీక్షకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గత సంవత్సరం ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సుల ఫిట్‌నెస్ గడువు ముగిసింది. పాఠశాలలు తిరిగి ఈనెల 12 నుంచి తెరుచుకోనున్నాయి. ఫిట్‌నెస్ ఉంటేనే బస్సులు రోడ్లపై తిప్పాలని, నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తామని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు..

ప్రవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు ప్రయత్నిస్తుంటాయి. విద్యార్థులను నేరుగా ఇంటి నుంచి తీసుకెళ్లి, తిరిగి సాయంత్రం ఇంటి వద్ద విడిచి పెట్టేందుకు వీలుగా బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. పట్టణ, గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకొచ్చేందుకు చాలా ప్రైవేటు పాఠశాలలు బస్సు సౌక్యం కల్పిస్తున్నాయి. ఈ మేరకు ప్రత్యేకంగా విద్యార్థుల నుంచి రవాణా చార్జీల పేరిట వసూలు చేస్తున్నాయి.

పాటించాల్సిన నిబంధనలు

- పాఠశాల బస్సు 15 ఏళ్ల కాలపరిమితి దాటకూడదు.
- విద్యాసంస్థల బస్సులు పసుపు రంగులోనే ఉండాలి.
- బస్సు నడిపే డ్రైవర్‌కు విధిగా హెవీ వెహికిల్ లైసెన్స్ ఉండాలి. వయస్సు 60 ఏళ్లలోపు ఉండాలి. బస్సు నడిపేందుకు ఐదేళ్ల అనుభవం ఉండాలి.
- బస్సుపై కుడి ఎడమ వైపు పాఠశాల పేరు, చిరునామా స్పష్టంగా రాయాలి.
- వాహనం ఆగితే బ్లింక్ అయ్యేలా పై భాగంలో నాలుగు వైపులా అంబర్ లైట్లు ఉండాలి.
- డ్రైవర్ లైసెన్స్‌ను పాఠశాల యాజమాన్యం ఆర్టీఏ కార్యాలయంలో విధిగా అందించాలి.
- బస్సులో ప్రథమ చికిత్స పెట్టె, మంటలను ఆర్పే వ్యవస్థ ఉండాలి.
- కిటికీలకు అడ్డంగా మూడు కడ్డీలు ఉండాలి.
- నేల నుంచి 325 మిమీ ఎత్తులో మెట్టు, ఎక్కేందుకు హ్యాండ్ రెయిలింగ్ ఉండాలి.
- అత్యవసర ద్వారం ఉండాలి, బస్సు డ్రైవర్, అటెండర్ ఫోన్ నంబర్లు విధిగా ఉండాలి.
- నెలకోసారి బస్సు డ్రైవర్‌కు బీపీ, షుగర్, కంటి పరీక్షలను విధిగా చేయించాలి.
- ప్రతి బస్సులో సీరియల్ నంబర్‌తో కూడిన ఫిర్యాదుల పుస్తకాన్ని అందుబాటులో ఉంచాలి.
- టీఎస్ స్కూల్ యాప్ ద్వారా విద్యా సంస్థ పేరు, డ్రైవర్, అటెండర్ పేరు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి స్కూల్ యాప్‌లో పొందుపర్చాలి.

నిర్లక్ష్యం తగదు



ప్రవేటు పాఠశాలల యాజమాన్యాలు బస్సుల ఫిట్‌నెస్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు. అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించాలి. చాలామంది తల్లిదండ్రులు బస్సుల్లో పిల్లలను పంపించాలంటే భయపడాల్సి వస్తోంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు.

– శివ, ఎస్‌ఎఫ్‌ఐ, జిల్లా ఉపాధ్యక్షుడు

రాజీ పడొద్దు



పిల్లల జీవితాలను దృష్టిలో పెట్టుకుని పాఠశాలల బస్సులను నడపాలి. భద్రత విషయంలో ఏ మాత్రం రాజీ పడొద్దు. బస్సులను పూర్తి స్థాయిలో కండీషన్‌లో ఉంచాలి.

– ప్రకాష్, షాద్‌నగర్

నిబంధనలు పాటించాల్సిందే..



పాఠశాలల యజమానులు నిబంధనలు పాటించాలి. బస్సులకు విధిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. ఫిట్‌నెస్ లేకుండా పాఠశాల బస్సులు రోడ్లపై తిరిగితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– బాలు నాయక్, ఎంవీఐ, షాద్‌నగర్

బలమైన శక్తిగా భారత్

- మోదీ సాహసోపేత నిర్ణయాలతో దేశం శరవేగంగా అభివృద్ధి
- పేద ప్రజలే లక్ష్యంగా సంక్షేమ పథకాల అమలు
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలన దక్షత, దౌత్యనీతి, సాహసోపేత నిర్ణయాలతో భారతదేశం బలమైన శక్తిగా ఎదిగిందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లులో నూతనంగా నిర్మించిన బీజేపీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ దేశానికే కాకుండా, ప్రపంచానికే నాయకుడిగా ఎదిగారన్నారు. తమ ప్రభుత్వం అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకుందని, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఆర్టికల్ 356 రద్దు, ట్రిపుల్ తలాక్ చట్టం రద్దు తదితర నిర్ణయాలతో మోదీ ప్రజల అభిమానం చూరగొంటున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ పెట్టుబడులతో జాతీయ రహదారులను నిర్మిస్తున్నట్లు చెప్పారు. దేశ భద్రత విషయంలో ప్రధాని కఠినంగా వ్యవహరిస్తున్నారని, దాయాది దేశమైన పాకిస్తాన్‌ను ఏకాకి చేసిన ఘనత మోదీకే దక్కిందన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా చూడటానికి తన విజన్‌తో పనిచేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో రూ.1.20 వేల కోట్లతో జాతీయ రహదారులను నిర్మించి 31 జిల్లాలకు అనుసంధానం చేసినట్లు కేంద్రమంత్రి వివరించారు. నియంత పాలన సాగిస్తున్న కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడడం ఖాయమన్నారు.

ఒంటరిగానే పోటీ: డీకే అరుణ

రాష్ట్రంలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య రహస్య అవగాహన ఉందని ఆరోపించారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసిన నేపథ్యంలో రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ మధ్య పొత్తు ఉంటుందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు అలాంటిదేమీ లేదన్నారు. ఎన్నో ఆశలతో ఏర్పడిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని విమర్శించారు. రాష్ట్రంలో ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, సుధాకర్‌రావు, మహేశ్వరం ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు కొప్పు భాషా, శేఖర్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్‌గౌడ్, అందె బాబయ్య, దిలీప్ ఆచారి, హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, శ్రీకాంత్‌సింగ్, రాంరెడ్డి, వెంకటేశ్, నర్సింహ, శ్రీధర్, సాయి తదితరులు ఉన్నారు.

పేదల భూములు పెద్దలకు కట్టబెడుతున్నారు: ఈటల

ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల భూములను లాక్కొని పెద్దలకు కట్టబెడుతున్నారని, రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా వ్యవహరిస్తున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. కొంగరకలాన్ సమీపంలో గత ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన భూములను బీఆర్‌ఎస్ సర్కార్ లాక్కుంటోందన్నారు. కోట్లాది రూపాయల భూములను లాక్కొని రైతులకు ఎకరాకు 300 గజాల ఇంటి స్థలం ఇస్తున్నారని, ఇది ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఫార్మాసిటీ పేరుతో సుమారు 20 వేల ఎకరాల భూములను ప్రభుత్వం లాక్కుందని, రూ. కోటి విలువ చేసే ఎకరా భూమికి , పదిలక్షల పరిహారం ఏం సరిపోతుందని నిలదీశారు. హైటెక్స్ సమీపంలో ఓ కార్పొరేట్ సంస్థకు 15 ఎకరాల భూమిని కేటాయిస్తే, హైకోర్టు మొట్టి కాయలు వేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే బీఆర్‌ఎస్ కార్యాలయం ఉండగా, శిక్షణ కేంద్రం పేరుతో కోట్ల రూపాయల విలువైన భూమిని నామ మాత్రం రేటుకు బీఆర్‌ఎస్‌కు అప్పగించడం తగదన్నారు. తెలంగాణలో బీజేపీకి అధికారం ఖాయమని ఈటల ధీమా వ్యక్తం చేశారు.

పారిశ్రామిక రంగంలో ముందంజ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: రాష్ట్రంలోనే పారిశ్రామిక రంగంలో జిల్లా ముందంజలో ఉందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధిలోని రావిర్యాల ఈ–సిటీలో తెలంగాణ పారిశ్రామిక ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో మహేశ్వరం నియోజకవర్గంలో నూతన పరిశ్రమలు వస్తున్నాయన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రోత్సాహం, సౌకర్యాలు ఉండటంతో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంత రూపురేఖలు మారడంతో పాటు, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గుజరాత్ పెట్టుబడిదారులు సైతం తెలంగాణ వైపు చూస్తున్నారని అన్నారు. ఇప్పటికే కోట్ల రూపాయలు వెచ్చించి నూతన సాంకేతిక విజ్ఞానంతో కూడిన పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్, ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఆయా కంపెనీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్.. అతివేగం

- లారీని ఢీకొన్న కారు
- ఒకరు మృతి: నలుగురికి తీవ్ర గాయాలు



నుజ్జునుజ్జయిన కారు



ఉబేద్ మృతదేహం

మొయినాబాద్: అసలే రాంగ్‌రూట్.. ఆపై అతివేగం .. ఒకరి మృతికి కారణమైంది. లారీని కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో నలుగురికి తీవ్ర గాయాలలైన ఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ సమీపంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని మీరాలం మండికి చెందిన ఎండీ ఉబేద్ (24), కార్వాన్ టప్పాచబుత్రా ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖాజా, ఎండీ ఇస్మాయిల్, ఇబ్రహీం, నహీమ్ స్నేహితులు. వీరంతా సోమవారం రాత్రి కారులో మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి శివారులో ఉన్న ఓ ఫాంహౌస్‌కు వచ్చారు. రాత్రి అక్కడ గడిపారు. మంగళవారం ఉదయం 6.30 గంటలకు నగరానికి వెళ్లేందుకు కారులో బయలు దేరారు. మొయినాబాద్ సమీపంలోని తాజ్‌హోటల్ వద్ద రాంగ్‌రూట్లో అతివేగంగా వెళ్తున్న కారు.. ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. కారు ఇంజిన్ ఎగిరి దూరంగా పడిపోయింది. అయిదుగురు యువకులు కారులోనే ఇరుక్కుపోయారు. ఉబేద్ అక్కడికక్కడే మృతి చెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఇరుక్కుపోయిన వారిని పోలీసులు బయటకు తీసి.. చికిత్స కోసం నగరంలోని ఆస్పత్రికి తరలించారు.

రెవెన్యూలో బదిలీలకు కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో: రెవెన్యూ యంత్రాంగంలో బదిలీలకు కసరత్తు ప్రారంభమైంది. మరో ఆరు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బదిలీల ప్రక్రియకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఒకేచోట పాతుకుపోయిన పలువురు ఆర్డీఓలు, తహసీల్దార్లకు స్థానచలనం కలగనుంది. గ్రేటర్‌లో సుమారు 80 మంది అధికారులు బదిలీ కానున్నట్లు సమాచారం. హైదరాబాద్ జిల్లా పరిధిలో 32 మంది తహసీల్దార్లు, ఓ రెవెన్యూ డివిజన్ అధికారి, రంగారెడ్డి జిల్లా పరిధిలో 25 మంది, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో 22 మంది అధికారులపై బది లీ వేటు పడనుంది. జూలై 15లోగా ఈ ప్రక్రియ పూర్తి చేసేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ భారీగా తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఎన్నికల కోడ్ తర్వాత తిరిగి వచ్చారు. ఈసారి కూడా తహసీల్దార్లు, రెవెనూ అధికారులు బదిలీ అయ్యే అవకాశాలున్నాయి.

రెండో ప్రియుడి మోజులో..

- మొదటి ప్రియుడి హత్య
- డ్రమ్ములో శవం కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం ఏసీపీ అంజయ్య

పహాడీషరీఫ్: పది రోజుల క్రితం వ్యక్తిని దారుణంగా హతమార్చి డ్రమ్ములో కుక్కి చెరువులో పడేసిన ఘటనకు వివాహేతర సంబంధమే కారణమని పహాడీషరీఫ్ పోలీసులు నిర్ధారించారు. రెండో ప్రియుడి మోజులో పడిన మహి ళ అతనితో కలిసి మొదటి ప్రియుడిని హత్య చేసింది. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం ఏసీపీ సి.అంజయ్య, ఇన్‌స్పెక్టర్ ఎం.కాశీ విశ్వనాథ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పూరన్ సింగ్ అలియాస్ దీపక్(30)కి వివాహానికి ముందే బంధువైన జయాదేవితో ప్రేమాయణం కొనసాగింది. అనివార్య కారణాలతో ఇద్దరూ వేర్వేరు సంబంధాలు చేసుకోవాల్సి వచ్చింది. వివాహానంతరం భార్య మమతతో కలిసి పూరన్‌సింగ్ చాంద్రాయణగుట్ట బండ్లగూడకు వలస వచ్చాడు. లాక్‌డౌన్ సమయంలో జయాదేవి తన భర్త, పిల్లలను వదిలేసి కాటేదాన్‌కు వచ్చింది. పూరన్‌సింగ్‌తో వివాహేతర సంబంధం కొనసాగించింది. ఈ క్రమంలోనే ఇంటి సమీపంలోనే ఉంటున్న హర్యానాకు చెందిన నజీం(31)తో కూడా వివాహేతర సంబంధాన్ని నెరపసాగింది. తుక్కుగూడలో వేరుగా గది తీసుకుని అతడితో సహజీవనం సాగించింది. పూరన్‌కు అనుమానం వచ్చిందని గ్రహించిన వారు ఎలాగైనా అత డిని మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నారు.

పథకంలో భాగంగా..

ముందస్తు పథకంలో భాగంగా జయాదేవి, నజీం కామన్ ఫ్రెండ్‌గా ఉన్న రాజేంద్రనగర్‌లో నివసించే తమిళనాడుకు చెందిన సుగుణా రాము(42)తో ఈ నెల 22న రాత్రి పూరన్‌సింగ్‌కు ఫోన్ చేయించి బాకీగా ఉన్న రూ.10 వేలు ఇస్తానంటూ తుక్కుగూడకు పిలిపించారు. నమ్మి వెళ్లిన పూరన్‌సింగ్‌ను నజీం, అతని స్నేహితుడు మబీన్, జయాదేవి, అసద్‌తో కలి సి దారుణంగా కత్తితో దాడి చేసి హత్య చేశారు. మృతదేహాన్ని డ్రమ్ములో కుక్కి జేసీబీ ముందుండే పారలో వేసుకొని సమీపంలోని సూరం చెరువులో పడేసి పరారయ్యారు. పోలీసులు నజీం , సుగుణా రామును అరెస్ట్ చేయగా..మిగిలిన ముగ్గురు పరారీలో ఉన్నారు.

ఇద్దరు ప్రయాణికుల వద్ద బంగారం పట్టివేత

శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దుబాయ్ నుంచి ఇండిగో 6ఈ–1484 విమానంలో మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఇద్దరు ప్రయాణికుల కదలికలను అనుమానించిన అధికారులు వారిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మలద్వారంలో క్యాప్సుల్స్‌లో పేస్టు రూపంలో ఉన్న బంగారం తీసుకొచ్చినట్లు గుర్తించి వైద్యుల పర్యవేక్షణలో వాటిని బయటికి తీయించారు. మొత్తం ఆరు క్యాప్సుల్స్‌లో కిలో 705 గ్రాముల బంగారం బయటపడింది. బంగారం విలువ రూ.1.5 కోట్లు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇఫ్లూలో నాన్‌టీచింగ్ ఉద్యోగాల భర్తీకి ప్రకటన

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారేన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో నాన్‌టీచింగ్ ఉద్యోగాల భర్తీకి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. గ్రూప్–ఎ, బి, సి కేటగిరీల్లో పీఆర్వో, డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌తో పాటు మొత్తం 132 పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు ఇఫ్లూ వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

శంకర్‌పల్లి: ఓ డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైంది. ఈ సంఘటన శంకర్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన విద్యార్థిని (19) చేవెళ్లలోని చైతన్య డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. రోజు మాదిరిగానే కళాశాలకు వెళ్తున్నానని చెప్పి సోమవారం ఉదయం ఇంట్లోంచి బయలుదేరింది. సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. విద్యార్థిని తండ్రి శ్రీనివాస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక..

విద్యార్థిని ఆత్మహత్య



శ్రీనిధి మృతదేహం

ఆమనగల్లు: హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమనగల్లు మండల పరిధిలోని రాంనుంతల మాజీ సర్పంచ్ శ్వేత, ఆనంద్ దంపతుల కూతురు శ్రీనిధి(16) ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్ చదువు కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చేర్పించారు. అయితే.. హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేని ఆమె తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

దాహార్తి తీరట్లే!

- పెరిగిన మంచినీటి వినియోగం
- బస్తీలు, కాలనీల్లో నల్లా నీళ్లు అరకొర
- వెంటాడుతున్న లోప్రెషర్ సమస్య
- ట్యాంకర్ల సరఫరా అంతంత మాత్రంగానే
- 30 శాతానికిపైగా మినరల్ క్యాన్లపైనే ఆధారం
- ఇదీ హైదరాబాద్ మహానగర పరిస్థితి

సాక్షి, సిటీబ్యూరో: మహా నగర దాహార్తి పూర్తి స్థాయిలో తీరడం లేదు. వేసవి ఉష్ణోగ్రతల తీవ్రత దృష్ట్యా తాగునీటి వినియోగం బాగా పెరిగింది. జలాశయాల్లో సరిపడా నీటి నిల్వలున్నా.. సరఫరాలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంతో పోలిస్తే పరిస్థితిలో కొంత మెరుగైనప్పటికీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా జరగడం లేదనే ఆరోపణలున్నాయి. జలమండలి రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్న నీరు సరిపోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో లోప్రెషర్ సమస్య వెంటాడుతోంది. బస్తీలు, కాలనీల్లో పరిస్థితి దయనీయంగా మారింది. రోజువారీగా నల్లాలు, ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న నీళ్లు నగరవాసుల అవసరాలు తీర్చడంలేదు. మరోవైపు సుమారు 30 శాతం కుటుంబాలు మినరల్ క్యాన్లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

వాస్తవాలకు భిన్నంగా..

నగరంతోపాటు శివారు ప్రాంతాలకు దినసరి సరఫరా చేస్తున్నట్లు జలమండలి అధికారులు చెబుతున్నా.. వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. నగర జనాభాకు అనుగుణంగా సాధారణంగా రోజువారీగా 570 నుంచి 580 ఎంజీడీలు నీరు అవసరం. వేసవి దృష్ట్యా ఈ డిమాండ్ 620 నుంచి 640 ఎంజీడీలకు పెరిగింది. జలమండలి నగర వాసుల అవసరానికి తగ్గట్లుగా నీటి సరఫరా కోసం రూపొందించిన వేసవి కార్యాచరణ ప్రణాళిక కూడా ఆచరణలో అభాసుపాలైంది. మే నెలాఖరు నాటికి రోజువారీగా 565 మిలియన్ గ్యాలన్లతో పాటు అదనంగా మరో 42 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ)నీటిని సరఫరా చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించినా .. ఆచరణలో కార్యరూపం దాల్చలేదు.

లోప్రెషర్ సమస్య

నల్లా నీటికి లోప్రెషర్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. కొన్ని నివాస సముదాయాల్లో నల్లాలకు అక్రమంగా మోటార్ వినియోగించడంతో లో ప్రెషర్ సమస్య వెంటాడుతోంది. మరోవైపు ఎగువ ప్రాంతాలకు సైతం అంతంత మాత్రంగా తయారైంది. నీటి సరఫరా సమయం కూడా పలు ప్రాంతాల్లో తగ్గుముఖం పట్టింది. సాధారణంగా 2 గంటల పాటు నీటి సరఫరా ఉంటుంది. కానీ.. పలు బస్తీల్లో కనీసం అరగంట నుంచి 45 నిమిషాల మించి సరఫరా కావడం లేదనే ఆరోపణలున్నాయి.

ట్యాంకర్ల కోసం ఎదురు చూపులే...

నగరంలో జలమండలి ట్యాంకర్ల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. బస్తీలకు సరఫరా చేసే ఉచిత ట్యాంకర్ల విషయం పక్కకు పెడితే గృహోపయోగ వాణిజ్య ట్యాంకర్ల సరఫరా పరిస్థితి కూడా అంతంతగా తయారైంది. బహుళ అంతస్తుల సముదాయాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు ఎండిపోయి ట్యాంకర్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. నగరంతోపాటు శివారు ప్రాంతాల్లోని ఫిల్లింగ్ కేంద్రాలకు దినసరి ట్యాంకర్ల బుకింగ్ సంఖ్య పెరుగుతున్నా.. ట్యాంకర్ల సరఫరా మాత్రం నత్తకు నడక నేర్పిస్తోంది. దీంతో జలమండలి ట్యాంకర్ల కోసం సుదీర్ఘ నిరీక్షించాల్సి వస్తోంది. వినియోగదారులు ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. వేసవి దృష్ట్యా మంచి నీటి ట్యాంకర్ల సరఫరాలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో సైతం జలమండలి విఫలమైందనే విమర్శలున్నాయి. అవసరమైన చోట్ల అదనంగా ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ల ఏర్పాటుతో అదనపుట్యాంకర్లు, ట్రిప్పులు పెంచుతామని అధికారులు ప్రకటించినా.. ఆచరణలో లేకుండా పోయింది.



సాగర్‌రోడ్డుపై మూడు ప్రమాదాలు

ఒకరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు



సాగర్‌రోడ్డుపై నక్కగుట్టతండా వద్ద ప్రమాదానికి గురైన కారు, బైక్

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై మంగళవారం మూడు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ లింగయ్య కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సపావట్ రాజు(25) మంగళవారం ఉదయం తన బైక్‌పై నగరానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో నక్కగుట్టతండా వద్ద యాచారం వైపు నుంచి మాల్ వైపు వెళ్తున్న కారు.. రాజు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఘటనలో తక్కళ్లపల్లి గేట్ సమీపంలో సాగర్‌రోడ్డుపై వెళ్తున్న ఆటోను డీసీఎం ఢీకొనగా.. ఆటో డ్రైవర్ వెంకటేశ్, డీసీఎం డ్రైవర్ మురళీధర్‌రెడ్డికి గాయాలయ్యాయి. గునుగల్ అటవీప్రాంతంలో నల్లగొండ జిల్లా నాంపల్లికి చెందిన జగన్.. బైక్‌పై నగరానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రియుడు మోసం చేశాడని..

యువతి ఆత్మహత్య



అపర్ణ (ఫైల్)

మొయినాబాద్: పెళ్లి చేసుకుంటానని మాటిచ్చిన ప్రియుడు మరో అమ్మాయిని వివాహం చేసుకోవడంతో మనస్తాపం చెందిన యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన సోమవారం సాయంత్రం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతిరెడ్డిపల్లికి చెందిన బీ అపర్ణ(20) గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో కాంట్రాక్ట్ టీచర్‌గా పనిచేస్తోంది. అదే గ్రామానికి చెందిన బీ శివ అనే యువకుడు అపర్ణను కొంత కాలంగా ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని మాటిచ్చాడు. కానీ శివ ఇటీవల తన మేనమామ కూతురును పెళ్లి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న అపర్ణ మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశ్రామిక ప్రగతి ఉత్సవం




మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని కాటేదాన్ ఇండస్ట్రీయల్ ఏరియాలో మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది సంబరాల్లో భాగంగా పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం 2014లో ఏర్పడిన తరువాత పారిశ్రామిక ప్రగతిలో సాధించిన విజయాలను టీఎస్ఎస్ఐసీ ఫీల్డ్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పారిశ్రామిక రంగంలో జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం, వెనుకబడిన ప్రాంతాల్లో కూడా ఉపాధి అవకాశాలను సృష్టించడం కోసం తెలంగాణ ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చన జయప్రకాష్, ఎంపీపీ జయమ్మ, శంషాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మా, ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీడీఓ వసంతకుమారి, టీఎస్ఎస్ఐసీ కమిషనర్ అజిజియా సుల్తానా పాల్గొన్నారు.

వాణిజ్య పంటలతో ఆహార భద్రతకు ముప్పు

ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంతర్జాతీయ సామ్రాజ్యవాదులకు తలొగ్గుతున్న నయా పాసిస్టు భారత ప్రధాని నరేంద్ర మోదీ అని ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు ప్రభాత్ పట్నాయక్ విమర్శించారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో అరబండి లక్ష్మీనారాయణ 5వ స్మారకోపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రభాత్‌పట్నాయక్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని సరుకుగా మార్చడమే లక్ష్యంగా సామ్రాజ్యవాదులు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. దానికి అనుగుణంగా బీజేపీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చిందని గుర్తు చేశారు. అందుకే రైతులు పోరాడి ఆ చట్టాలను వెనక్కి తిప్పికొట్టారన్నారు. వాణిజ్య పంటలతో ఆహారభద్రతకు పెను ముప్పు ఉందన్నారు. దేశ ప్రజల అవసరాలు తీరుస్తూనే విదేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు క్రిష్ణన్ మాట్లాడుతూ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, వ్యవసాయ ఉత్పత్తులకు 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయిస్తామంటూ మోదీ ఇచ్చిన హామీలు నెరవేరడం లేదన్నారు. వ్యవసాయ రంగ నిపుణులు డాక్టర్ జానయ్య, ఏఐకేఎస్ జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, తెలంగాణ రైతు సంఘం అధ్యక్షులు పి.సుదర్శన్, ప్రధాన కార్యదర్శి టి.సాగర్, సహాయ కార్యదర్శి శోభన్, రైతు సంఘం ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహ్మారెడ్డి, అరబండి ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ అరబండి మనోహర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ అపహరణ

యాచారం: చోరీకి కాదేది అనర్హం అన్నట్లు దొంగలు ఓ ట్రాన్స్‌ఫార్మనూ ఎత్తుకెళ్లారు. యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. స్టేషన్‌కు సమీపంలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర చేరుకున్న దుండగులు.. ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపేశారు. స్తంభంపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్



నిందితుడు బంటి

పహాడీషరీఫ్: ఓ వ్యక్తిని హత్య చేసిన నిందితుడిని బాలాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ బి.భాస్కర్ కథనం ప్రకారం..ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఖాటుకుడీ కశ్యప్ సోదరుడి కుమార్తె విషయమై పక్కింట్లో ఉండే బీహార్ రాష్ట్రానికి చెందిన బంటి(27) గొడవ పడడం.. అడిగేందుకు వెళ్లిన అతన్ని దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు పాల్పడిన నిందితుడిని మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం కర్ణాటకకు చెందిన చెందిన రాజేందర్(40) డ్రైవర్. కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం భార్య పిల్లలతో బండ్లగూడకు వలస వచ్చాడు. తాగుడుకు బానిసై విధులకు హాజరుకాకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోతుండడంతో భార్యతో తరచూ గొడవపడుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన రాజేందర్ శిశుమందిర్ ప్రాంతంలోని ఖాళీ స్థలంలో ఓ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐఐటీ హైదరాబాద్‌తో 'మనూ' ఒప్పందం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని హెచ్‌కే షేర్వానీ సెంటర్ ఫర్ డెక్కన్ స్టడీస్(హెచ్‌కేఎస్‌సీడీఎస్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ–హైదరాబాద్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిజైన్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒప్పందంపై ఉర్దూ యూనివర్సిటీ నుంచి ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ఓఎస్‌డీ–2 ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్, ఐఐటీ హైదరాబాద్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ శర్మ సంతకాలు చేశారు. డెక్కన్ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, నీరు, గాలి, పర్యావరణం, జీవనోపాధికి సంబంధించిన అంశాలపై పనిచేయడానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందని అధికారులు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: హెచ్‌సీయూలో స్టార్టప్ లాంచర్ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులు కోరుతున్నారు. హెచ్‌సీయూ, ది ఎంటర్‌ప్రెన్యూర్ జోన్ (టీఈజెడ్–స్టార్టప్ యాక్సిలరేటర్) సంయుక్తంగా ఎస్పైర్ స్టార్టప్ లాంచర్ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులను కోరుతున్నారు. ఇది స్టార్టప్‌లను ప్రారంభించడం, అభివృద్ధి చేయడంలో సహాయపడటానికి వారికి సలహాలు ఇస్తుంది. ఈ కార్యక్రమాన్ని జూన్ 24 నుంచి ప్రారంభించి సెప్టెంబర్ 9వ తేదీ వరకు కొనసాగిస్తారు. అర్హులైన వారు జూన్ 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.